క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజా కార్యక్రమంలో భక్తులు

పెద్దేముల్: అయ్యప్ప జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి పడిపూజను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తి పాటలతో గ్రామం మారు మోగింది. అయ్యప్ప భక్తులు పడిపూజలో పాల్గొని పడిని కాల్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



షెడ్డు నిర్మించిన వ్యక్తికి నోటీసు అందజేస్తున్న కార్యదర్శి

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రం చిన్నగేటు ప్రాంతంలో ఒక వ్యక్తి డబ్బాను ప్రభుత్వ మురుగుకాల్వకు ఆనుకుని వేశారు. ఈ మేరకు సదరు వ్యక్తికి సోమవారం నోటీసు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. షెడ్డును వెంటనే తొలగించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'కాసాని' విజయం ఖాయం

యాలాల: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం ఖాయమని ముదిరాజ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి ముదిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు చెవేళ్ల పార్లమెంటు స్థానం బీసీలకు కేటాయించలేదని, పార్టీ అధినేత కేసీఆర్ బీసీలను గుర్తించి కాసానికి ఎంపీ టిక్కెట్ కేటాయించడం హర్షణీయమని వెల్లడించారు. 96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి, అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చిన జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఎస్ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సీతారాముల కల్యాణం ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్ఐ సూచించారు. ఆలయ అర్చకులు జోషి ప్రదీప్ చారీ మాట్లాడుతూ.. మంగళవారం నుంచి కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శివ కుమార్, పాల నర్సింలు, బంధయ్య, కల్యాణ్, రాజేష్, అశోక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

17న బుగ్గలో..

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధి బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో బుధవారం ఉదయం 10.35 గంటలకు సీతారాముల కళ్యాణం జరుగుతుందని ఉత్సవ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తండ్రి కోసం తనయుడి ప్రచారం



రైతు బజార్‌లో ప్రచారం చేస్తున్న ఆర్యన్‌రెడ్డి

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వికారాబాద్ రైతుబజార్‌లో రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని రైతులను కోరారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దానమొల్ల వేణుగోపాల్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న శ్రీలత

కొత్తూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. అదేవిధంగా పెంజర్ల గ్రామంలో గల బీరప్ప ఆలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దైవచింతన కలిగిన వారు ఇతరులకు సాయం చేయడంతో పాటు ప్రేమానురాగాలతో మెలుగుతారని తెలిపారు. నాయకులు సత్యనారాయణ, శ్రీశైలం పాల్గొన్నారు.

కల్యాణం చూతము రారండి..

నేటి నుంచి శ్రీరామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన జుంటుపల్లి రామాలయం



శ్రీరాముడి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



ఆలయంలో కొలువు దీరిన దేవతామూర్తులు

యాలాల: శ్రీరామ నవమి సందర్భంగా జుంటుపల్లి శివారు గుట్టపై వెలసిన రామాలయంలో సీతారామ చంద్రస్వామి కల్యాణ ఉత్సవాలకు ముస్తాబు అయింది. 16వ తేదీ నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు మంగళవారం ఉదయం 10.15 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి పది గంటలకు ఎదుర్కోల్లు నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 11.55 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి 9.55 గంటలకు విమాన రథోత్సవం, గురువారం మధ్యాహ్నం 3.35 గంటలకు వసంతోత్సవం, పెరుగు బసంతం, శేష వాహన సేవ తదితర కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. చివరి రోజు శుక్రవారం మహాలక్ష్మి పూజ, హరికథ కాలక్షేపం, అన్నదాన కార్యక్రమాలుంటాయి.

ఆలయ చరిత్ర

జుంటుపల్లి గ్రామానికి చెందిన యాదవ వంశస్తులు, వెంకటకృష్ణ ఉద్దండరావు పశువుల కాపరిగా ఉంటూ, ఇక్కడి కొండలపై నివాసం ఉండేవారు. జాగీర్దార్ల పాలనలోనూ త్రికాల పూజలు చేస్తు ప్రజలకు సేవలు చేస్తుండేవాడు. ఒకరోజు మేడి చెట్టు కింద నిద్రిస్తుండగా, రాముల వారు కలలో వచ్చి, ఇక్కడ ఆలయం నిర్మించాలని ఆదేశించాడు. వెంటనే మేల్కొన్న కృష్ణ.. ముఖమార్చన చేయడానికి సమీపంలోని కోనేటికి వెళ్లాడు. కోనేరులో దోసిళ్లలో నీటిని పట్టుకోగా.. అందులో ఒక విగ్రహం అతడికి వచ్చింది. ఇలా మూడుసార్లు నీటిని తీసుకోవడానికి యత్నించగా, మూడు విగ్రహాలు అతడి చేతిలోకి వచ్చాయి. విషయాన్ని తమ్ముడు రంగారావుకు వివరించాడు. అవి సీతారామలక్ష్మణుల విగ్రహాలుగా గుర్తించారు. అయితే అదే సమయంలో అటుగా వెళ్తున్న ఒక మహర్షి మందిర నిర్మాణానికి ఆశీస్సులు ఇచ్చి అదృశ్యమయ్యాడు. వెంటనే సోదరులిద్దరూ ఎలాంటి అనుమతి లేకుండా ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఉద్దండరావును జాగీర్దార్లు చెరసాలలో బంధించారు. బందీగా ఉన్న రావు సంకెళ్లు ఊడిపోవడాన్ని జాగిర్దార్లు గుర్తించి, ఆయనకు విముక్తి కల్పించారు. అనంతరం జుంటుపల్లి రామస్వామి ఆలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టి, అందరి మన్ననలను పొందాడు.

దోనేలో నిరంతరం నీరు

శ్రీరాముడు జైత్రయాత్రల్లో భాగంగా ఈ దేవాలయ సమీపంలో బస చేసినట్లు పూర్వీకులు చెబుతుంటారు. ఇక్కడ బస చేసినప్పుడు సీతాదేవి స్నానమాచరించడానికి దరిదాపుల్లో ఎలాంటి నీటి సౌకర్యం లేక పోవడాన్ని రాముడు గుర్తించాడు. తన బాణంతో అక్కడి కొండలపై ఉన్న పెద్ద బండరాయిని చీల్చగా.. అందులోంచి నీటి ధార బయటకు వచ్చింది. అప్పుడు అక్కడ సీతాదేవి స్నానమాచరించినట్లు ప్రచారంలో ఉంది. దీనినే దోనేగా ఇక్కడి వారు పిలుస్తుంటారు. ఈ దోనేలో నీరు ఎల్లప్పుడూ ఉండటం వలన ఉత్సవాలకు వచ్చిన భక్తులు



ఇక్కడ స్నానమాచరించడానికి ఇష్టపడతారు. ఇలా చేస్తే సుఖ సంతోషాలతో పాటు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ఏర్పాట్లు పూర్తి



శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. కొలనులో నీటిని పూర్తిగా శుభ్రం చేయించాం. స్నానమాచరించే సమయంలో తగిన జాగ్రత్తలు చేపట్టాం. తాగునీరు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశాం.

–హన్మంత్‌రావు, ఆలయ చైర్మన్

పల్లెపల్లెకూ సర్కారు వైద్యం

- పల్లె, బస్తీ దవాఖానాల ఏర్పాటు
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు



చిన్న నందిగామలో పల్లె దవాఖాన

కొడంగల్: గ్రామాల్లో ప్రాథమిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం పల్లె, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయడంతో సర్కార్ వైద్యం రోగులకు చేరువైంది. గతంలో ప్రభుత్వ వైద్యం కోసం పేదలు ఎదురు చూసేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సబ్ సెంటర్లను పీహెచ్‌సీలుగా మార్చారు. దీంతో పల్లె దవాఖానాల్లో పేదలకు మెరుగైన వైద్యం చేరువైంది. పేదలకు ఉపశమనం కలిగింది. కొడంగల్ మండలంలో ఐదు పల్లె, రెండు బస్తీ దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చిన్న నందిగామ, రావులపల్లి, అంగడిరాయచూర్, రుద్రారం, హస్నాబాద్ గ్రామాల్లో పల్లె దవాఖానాలు, కొడంగల్ మున్సిపల్ పరిధిలో రెండు బస్తీ దవాఖానాలు అందుబాటులో ఉన్నాయి.

సిబ్బంది ఇలా..

పల్లె దవాఖానాలో ఒక డాక్టర్, మొదటి, రెండో ఏఎన్‌ఎమ్, ఆశ కార్యకర్తలు విధుల్లో ఉంటారు. 'బస్తీ'ల్లో డాక్టర్, ఒక ఏఎస్‌ఎమ్, ఆశ కార్యకర్త అందుబాటులో ఉంటారు. చిన్న నందిగామ, అంగడిరాయచూర్, రుద్రారం, హస్నాబాద్ గ్రామాల్లోని పల్లె దవాఖానాలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. రావులపల్లి, కొడంగల్ మున్సిపల్ పరిధి రెండు బస్తీ దవాఖానాలు అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. రోగులకు అవసరమైన ఔషధాలు, సామగ్రి అందుబాటులో ఉంచారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే, ధర్మాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని రోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఆ జీఓను ఉపసంహరించుకోవాలి



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్లు

పరిగి: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకుల ఉద్యోగ విరమణ ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నష్ట పరిచేలా ఉందని, వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రం సీడీపీఓ కార్యాలయంలో సీడీపీఓ ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.రెండు లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్షతో పాటు 60 సంవత్సరాలు దాటిన వారికి వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించిందని తెలిపారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకుండానే జీఓను విడుదల చేసిందని, దానిని ఉపసంహరించుకొని, ప్రయోజనాలతో కూడిన కొత్త జీఓను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

ప్రకటించిన ఎంపీపీ, ఎంపీడీఓ



సమావేశంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

పెద్దేముల్: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ అనురాధ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మొత్తం 13 మంది ఎంపీటీసీలకు ఎంపీపీ అనురాధ, వైస్ ఎంపీపీ మధులత, అడ్కిచెర్ల ఎంపీటీసీ సభ్యుడు ధన్‌సింగ్ మినహా ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ, ఎంపీడీఓ జర్నప్ప చెప్పారు.

వచ్చింది ముగ్గురే..

ఉదయం 11గంటలకు జరగ వలసిన సమావేశం మధ్యాహ్నం ఒంటి గంట అయినా పూర్తి స్థాయిల్లో ఎంపీటీసీ సభ్యులు రాలేదు. ఎంపీడీఓ జర్నప్ప మరో 30 నిమిషాలు సమయం తీసుకున్నా.. ముగ్గురే వచ్చారు. దీంతో సమీక్ష వాయిదా వేశారు. వీరికి తోడు అధికారులు కూడా పూర్తిస్థాయిలో రాలేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి జవాబు దారి అయిన అధికారులు రాకపోతే, మా సమస్యలు ఎవరికి చెప్పాలని వచ్చిన ఎంపీటీసీలు వాపోయారు. మండల పరిధి అధికారులు మొత్తం వచ్చేలా చుడాలని వైస్ ఎంపీపీ మధులత, అడ్కిచెర్ల ఎంపీటీసీ సభ్యుడు ధన్‌సింగ్ సభ దృష్టికి తెచ్చారు. మళ్లీ సమావేశం తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఎంపీపీ వెల్లడించారు.

తాగునీటి ఎద్దడి రావొద్దు

- సమస్య ఉంటే వెంటనే పరిష్కరించండి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనితాగౌడ్
- ఐనెల్లి స్త్రీనిధి రుణాల గోల్‌మాల్‌పై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

తాండూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వొద్దని ఎంపీపీ అనితా గౌడ్ అధికారులకు చెప్పారు. సోమవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండలు మండుతున్నాయని, తాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే త్వరగా పరిష్కరించాలని, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి ఎద్దడి నివారణకు అత్యవసరమైతే డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా బోర్లు తవ్వించాలని వెల్లడించారు. పాఠశాలల మరమ్మతుల కోసం కలెక్టర్ రూ.2 కోట్ల 32 లక్షలు మంజూరు చేశారని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడారు. జీవాల పెంపకం దారుల కోసం కట్టిన డీడీలు వాపస్ ఇప్పించాలని పశువైద్యాధికారి నిజానంద్‌ను కోరారు.

స్త్రీనిధి రుణాల గోల్‌మాల్‌పై చర్చ

ఐనెల్లి గ్రామంలో స్త్రీనిధి రుణాలు రూ.18 లక్షల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలని ఏపీఎం ఆనంద్‌ను పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ కోరారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళల నుంచి డబ్బులు వసూలు చేసి, బ్యాంకులో జమ చేయక పోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు రుణాలు ఇచ్చే క్రమంలో సంఘం లీడర్లు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని కరన్‌కోట్ ఎంపీటీసీ సమావేశం దృష్టికి తీసుకు తెచ్చారు.

కరెంట్ కష్టాలు

సర్వసభ్య సమావేశం ముగిసేలోపు మూడుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో ఒక్క నిమిషం కూడా కరెంట్ పోయేది కాదని, ఇప్పుడు కరెంట్ కోతలు అధికమయ్యాయని కో ఆప్షన్ సభ్యులు శంషోద్దీన్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, ఎంపీడీఓ విశ్వప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, విద్యుత్ శాఖ ఏఈ కేవీ నాయుడు, మిషన్ భగీరథ ఏఈలు ప్రణీత్, ప్రతిభ, ఉద్యానశాఖ అధికారి మల్లికార్జున్ ఉన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్ఐ సిబ్బంది

బషీరాబాద్: వివిధ ప్రాంతాల్లో పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు రికవరీ చేశారు. ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు తమ స్మార్ట్ ఫోన్లను పోగొట్టుకొని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుల ఫోన్ల ఐఎంఈఐ నంబరు ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోలీసులు సెల్‌ఫోన్ల లోకేషన్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సోమవారం ఠాణా ఆవరణలో బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పరిగి: రంగంపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం రంగంపల్లి, ఇబ్రాహింపూర్, గడ్సింగాపూర్, సొండేపూర్‌తండా, సాలిపప్పలబాటతండాతో పాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలగనుందని ఏఈ ఖాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు సరఫరాను నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీపీ కార్యదర్శి బదిలీ

తాండూరు రూరల్: మండల పరిధి మల్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మన్యానాయక్‌ను గుండ్ల మడుగుతండాకు బదిలీ చేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తండాలో పని చేస్తున్న అశోక్‌ను మల్కాపూర్‌కు బదిలీ చేసినట్లు వెల్లడించారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

చేవెళ్ల: విద్యతోనే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట పడనుందని సినీ నటుడు బిత్తిరి సత్తి అలియాస్ కావలి రవికుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరులోని ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ఆడుతూ పాడుతూ వారిని నవ్వించారు. సత్తి వచ్చాడని తెలుసుకున్న స్థానికులు.. ఆయనను చూసేందుకు స్థానిక ప్రజలు అనేక మంది వచ్చారు. అనంతరం రవికుమార్ మాట్లాడారు విద్యార్థులు బాగా కష్టపడి చదివితే తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినాలని సూచించారు. 16 ఏళ్లుగా గ్రామంలోని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న పాఠశాల చైర్మన్, విద్యారత్న జాతీయ అవార్డు గ్రహీత సయ్యద్ బాబర్‌ను ప్రత్యేకంగా అభినందించాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ధారూరు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలో సోమవారం కొండాను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. పేదల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. మరోసారి అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాల గురించి ఓటర్లకు వివరించారు. ప్రజల కోసం పనిచేస్తున్న మోదీని మరోసారి ఆశీర్వదించి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండుగౌడ్, ఎం.రమేశ్, నెల్లి విశ్వనాథం, అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, విజయలక్ష్మి, రామకృష్ణ, జగదీశ్వర్, రాఘవేందర్‌గౌడ్, కృష్ణ, వెంకట్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నీరు, నీడ

- భూసారం పెంపొందించేందుకు పంట పొలాలకు చెరువు మట్టి తరలింపు
- ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్



కందనెల్లి చెరువులో మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న కూలీలు

పెద్దేముల్: ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరుతో పాటు నీడ కల్పిస్తున్నామని మండల ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్ తెలిపారు. సోమవారం మండల పరిధి కందనెల్లి గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఉపాధిపనుల్లో కూలీలకు జీపీ నిధుల ద్వారా తగిన సౌకర్యాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఒకటి, రెండు రోజుల్లో అన్ని ప్రాంతాల్లో వసతుల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కందనెల్లిలో మొత్తం 510 జాబ్ కార్డులు ఉన్నాయని, సోమవారం 305 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారని చెప్పారు. కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ఉపాధి ప్రదేశాల్లో కూలీలకు అవసర మైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇది ప్రతి గ్రామంలో అమలు అయ్యేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు ఎంపీఓ రమేష్ స్పష్టం చేశారు.

పొలాలకు చెరువు మట్టి

భూసారాన్ని పెంపొందించుకోవటానికి చెరువుల నుంచి నల్ల మట్టిని రైతులు సాగు భూములకు తరలిస్తున్నారని అధికారి తెలిపారు. రసాయన ఎరువులను అధిక మోతాదులో వినియోగించడం వలన భూసారం దెబ్బతిని పంటలకు తెగుళ్లు సోకి, ఆశించిన దిగుబడి రాక అన్నదాతలు నష్టపోతుండటం వలన, ప్రకృతి సేద్యానికి డిమాండ్ పెరిగి, రైతులు సేంద్రీయ ఎరువుల వైపు మొగ్గుచూపుతున్నారని వెల్లడించారు. సేంద్రీయ ఎరువులు తక్కువ ఖర్చుతో కూడుకుందని, అందుకే ప్రభుత్వం చెరువుల మట్టిని ఉపాధి కూలీల ద్వారా రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు తరలిస్తున్నారని, ప్రతి రైతు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ సూచించారు.



సేద తీరుతున్న ఉపాధి కూలీలు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఫైళ్లు సిద్ధం చేస్తున్న అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

దౌల్తాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ చేయనున్నారు. అందుకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేయడంలో ఈజీఎస్ అధికారులు నిమగ్నమయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు మండల పరిధిలో రూ.5.27కోట్ల విలువైన పనులను చేపట్టారు. ఇందులో ఎంతవరకు పనులు జరిగాయి. కూలీలకు చెల్లింపులు, తదిత వాటిపై తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో గుర్తించనుంది.

33 గ్రామాల పరిధిలో..

గ్రామాల్లోని కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ స్కీంలో ఏఏ పనులు చేపట్టారు, పనులు ఎంత మేరకు జరిగాయి, కూలీలకు డబ్బులు అందాయా లేదా అనే దానిపై క్షేత్రస్థాయిలో పర్యటించి, పనులు పరిశీలిస్తారు. ఉపాధి కింద మండలం వ్యాప్తంగా చెరువులు, కుంటల్లో పూడికతీత, జంగల్ కటింగ్, హరితహారంలో మొక్కలు నాటడం, వాటి పర్యవేక్షణ, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, కల్లాల నిర్మాణాలు రైతుల భూముల చదును చేయడం, చేపల పెంపకం, చెరువులు, పశువుల పాకలు, వననర్సరీల్లో మొక్కల పెంపకం, సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.

బృందాల వారీగా తనిఖీలు

ఉపాధి పథకంలో 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు మండలంలో చేపట్టిన పనులను తనిఖీ చేసేందుకు సామాజిక తనిఖీ బృందం మండలానికి వచ్చింది. అందుకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేస్తున్నాం. గ్రామాల్లో బృందాల వారీగా తనిఖీలు చేపడతారు. గ్రామసభల అనంతరం మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ చేపట్టిన పనులను పూర్తి స్థాయిలో వెల్లడిస్తారు.

–రజనీకాంత్, ఏపీఓ, దౌల్తాబాద్